

# "జీవితానికి దూరంగా"

టి. శ్రీవల్లీ రాధిక

చీటికీ మాటికీ కలల్లోకి జారిపోయేందుకూ..., పెదవులపైకి అదే పనిగా చిరు నవ్వు పాకేందుకూ..., హడావుడిగా పరుగులు తీసేందుకూ, అంతలోనే పరధ్యానగా నిలబడిపోయేందుకూ... సునంద వయసు పదహారు కాదు. నలభై ఆరు.

తను మరీ బయటపడి పోతూందనీ, ఆనందాన్ని దాచుకోలేక పోతూందనీ ఆమెకు తెలుస్తోంది. ఆ సంతోషాన్ని చూసి అందరూ ఈర్ష్య పడతా రేమో, దిష్టి తగులుతుం దేమో అని మరో పక్క భయంగా కూడా ఉంది.

కానీ నిగ్రహించుకోవడం ఆమె వల్ల కావడం లేదు.

ఈ రోజే పుట్టినట్లూ, ఈ రోజే యవ్వనంలో అడుగుపెట్టినట్లూ.... ఈ రోజే భగవంతుడు పిలిచి "ఇదిగో నమ్మా సునందా!" అంటూ తన జీవితాన్ని తన చేతుల్లో పెట్టినట్లూ... అనిపిస్తోంది ఆమెకి.

అవును. పుట్టి నలభై ఆరు ఏ ళ్లైనా, ఇన్నాళ్లూ సునంద జీవించలేదు.

'నా జీవితంలో ఆనందాన్ని ఇచ్చినవి' అని చెప్పుకో గల సంఘటనలు ఆమెకు లేవు.

'నా జీవితంలో సన్నిహితమైన వాళ్లు' అని చెప్పుకో గల వ్యక్తులు లేరు.

'నా జీవితంలో సాధించినవి' అని చెప్పుకో గల విజయాలూ లేవు. నిజంగా ఆమెకు ఇ వేమీ లేవు.

ఆమె పుడుతూండగానే ఆమె తల్లి చనిపోయింది. ఊహ తెలియక ముందే సవతి తల్లి ఆమె చే యందుకుంది.

ఆ తరువాత జీవిత మంతా ఇక ఆ సవతి తల్లి వెనుక నడవడంలోనే గడిచిపోయింది,

తెల్లవారు జామున నాలుగు గంటలకి నిద్రలేచేది సునంద. ఇంటికి నాలుగు వైపులా ఊడ్చి, కళ్లాపి, చల్లి, ముగ్గులు పెట్టడంతో దిన చర్య ప్రారంభ మయ్యేది.

పాలు పితకడం, అందరినీ లేపి కాఫీ లివ్వడం, ఇంటెడు బట్టలూ ఉతకడం, అం ట్లన్నీ వేసుకుని తోమడం...

సునందకి గడియారాలూ, రిస్ట్ వాచ్‌లూ తెలీవు. ఆమెకి తెలిసిం దొకటే. "తను పని చేస్తూ ఉంటే కాలం గడుస్తుంది. కాలం గడుస్తూ ఉన్నా తను పనిచేస్తూనే ఉంటుంది."

ఇరవై ఏళ్లు వచ్చే వరకూ అలాగే గడిచింది ఆమె జీవితం. ఆ ఇల్లు తప్ప మరో లోకం తెలీకుండా, పని తప్ప మరో విషయం తెలీకుండా.

అప్పుడు.... పె ళ్లయ్యింది.

పెళ్లి అవుతుందని తెలిసినపుడు, పెళ్లి జరుగుతూన్నప్పుడు కూడా సునందకు కాలం నిర్లిప్తంగానే గడిచింది.

మొదటి రాత్రి... శంకరం ఉన్న గదిలోకి అడుగుపెట్టబోతూ...., తలుపు దగ్గర ఒక్క క్షణం ఆగినప్పుడు.

అప్పుడు... ఆ ఒక్క క్షణం మాత్రం సునంద జీవించింది.

అవును. ఆమె పుట్టాక ఆశ, ఉద్వేగం లాంటి భావాలు ఎప్పుడైనా అనుభవించిందంటే అది ఆ ఒక్క క్షణమే.

శరీరాన్ని చుట్టేసిన తెల్లచీర "వెళ్లు, లోపల నీ మనసును ప్రేమ బంధంతో పెనవేసే స్నేహితు డున్నాడు" అని చెప్తుంటే,

జడలోని మల్లెలు "ఇకపై జీవిత మంతా పరిమళ భరితమే" అని ఆమె చెవిలో గునగున లాడుతూంటే,

తనకి ఇష్ట మయినట్లుగా, తన ఆలోచనలకి

తగినట్లుగా, తను జీవించబో[ే] కొత్త జీవితం... చేతిలో ఉన్న పాల గ్లాసంత స్వచ్ఛంగా కనిపిస్తుంటే...

లోపలికి అడుగుపెట్టింది సునంద.

శంకరం కనిపించాడు. అర్థ మయ్యాడు. ఆమెలోని జీవం చచ్చిపోయేంత వరకూ మెల్ల మెల్లగా అర్థమయ్యాడు.

సునంద ఊహించినట్లుగా పె ళ్లయ్యాక జీవితం మారలేదు. ఆమె అత్త వా రింటికి వెళ్లలేదు. శంకరమే ఇక్కడ ఉండిపోయాడు.

అదే ఇల్లు, అదే పని, కాకపోతే ఇపుడు వాటికి తోడుగా - బాధ్యత తెలియని భర్త... అతనికి చేయాల్సిన సేవలూ కూడా చేరాయి.

ఇంట్లో ఉండేది నలుగురే మనుమలు. అయినా, సునంద ఏదో ఒక పనితో రో జంతా సతమత మయేలా శ్రద్ధ తీసుకునేది సుభద్రమ్మ.

తమ్ముడు హాస్టల్లో ఉండేవాడు. సెలవుల్లో అతను ఇంటికి వస్తే ఇక సునందకి ఊపిరి తీసుకునే అవకాశం కూడా ఉండేది కాదు. "రాజేష్‌కి అరిసె లంటే ఇష్టం. రాజేష్‌కి కజకాయ లంటే ఇష్టం" అంటూ అవన్నీ వండించేది సుభద్రమ్మ.

అవును మరి. ఆవిడ సునందకి సవతి తల్లి కానీ రాజేష్‌కి కన్న తల్లి. తల్లిదండ్రుల ఆశలన్నీ రాజేష్ మీదే ఉండేవి. శ్రద్ధగా చదివే వాడు రాజేష్. టెన్నిస్ ఆడేవాడు. ఎదుటి వాళ్లు దాసోహ మనేటంత అద్భుతంగా ఫ్లూట్ వాయించేవాడు.

జీవిత మంటే ఏమిటో అతనిలో కనిపించేది సునందకి. తను చనిపోయి తమ్ముడి శరీరంలోకి పరకాయ ప్రవేశం చేయా లనిపించేది.

ఇంజనీరింగ్ అయిపోగానే పై చదువులకి ఫారిన్ వెళ్లి పోయాడు రాజేష్. ఆ తర్వాత అక్కడే పెళ్లి. అక్కడే ఉద్యోగం. తండ్రి చనిపోయినప్పుడు కూడా రాలేదు.

తండ్రి చనిపోవడానికి కొంచెం ముందు... ఎప్పుడైనా అనిపించేది సునందకి, "నాకూ ఒక కొడుకు పుడితే..." అని. మనవడిని ముద్దు చేసే తండ్రిని చూడాలని.

తీరే దేనేమో ఆమె కోరిక!

ఒక అర్థ రాత్రి... సునంద నగలతో, బీరువాలో ఉన్న డబ్బుతో, రెడ్డి గారు ఉంచుకున్న కామాక్షితో - శంకరం పారిపోయి ఉండకపోతే...


శంకరం ఊ రొదిలి వెళ్లిపోయా డని తెలిసినప్పుడు సునందకి దుఃఖం రాలేదు. డబ్బులూ, నగలూ తల్చుకుని సవతి తల్లీ, తండ్రీ గుండెలు బాదుకుంటూంటే ఆమెకి అర్థం కాలేదు. చివరికి, అతని గుర్తులుగా ఆమె వంటి మీద మిగిలిపోయిన దెబ్బలూ, వాతలూ కూడా ఆమెకి చిరాకు కలిగించలేదు.

అంతటి నిర్లిప్తత ఆవరించేసింది ఆమెని.

ఒక నడక వచ్చిన యంత్రం లాగా, యావజ్జీవ శిక్ష పడిన ఖైదీ లాగా తిరిగింది ఆమె ఆ ఇంట్లో.

పాతిక సుదీర్ఘమైన సంవత్సరాలు...

ఎన్నో వసంతా లొచ్చాయి. హేమంతా లొచ్చాయి. ఎన్నో ఇళ్లు పసి పిల్లల కేరింతలతో పులకరించాయి. పెద్ద వాళ్లకి వీడ్కో లిచ్చి కన్నీళ్లు



కార్చాయి.

ఊళ్లోకి హైస్కూల్ వచ్చింది. కాలేజీ వచ్చింది. అమ్మాయిలు సైకిల్ తొక్కుకుంటూ కాలేజీకి వెళ్లే రోజులు వచ్చాయి.... కానీ ఇ వేమీ సునంద ప్రత్యక్షంగా చూడలేదు.

అవే కాదు - తండ్రి చనిపోయిన రెండేళ్లకి కట్టిన శివాలయం.... ఈ ఇరవై మూడేళ్లలో ఒక్క సారి కూడా సునంద చూడలేదు.

అసలు సునందకి ఏం తెలు సని! ఏమీ తెలీదు. తల్లి కేకకు ఉలిక్కిపడి పరుగెత్తడం... యంత్రంలా పనిచేయడం తప్ప ఏమీ తెలీదు.

ఇప్పుడు సుభద్రమ్మ ఆరోగ్యం బాగా క్షీణించింది. మాట కూడా సరిగా రావడం లేదు. సునందకి రో జంతా ఆవిడ సపర్యలతోనే సరిపోతుంది.

స్థిమితంగా ఒక్క నిమిషం నిలుచునేందుకూ, ఆదమరచి ఒక్క క్షణం నిద్రబోయేందుకూ ఉండదు.

తోటలోని కనకాంబరాలు మాలకట్టి, చిన్నకృష్ణుడి పటానికి వేయా లన్న కోరిక కూడా సునందకి రోజుల తరబడి తీరదు.

ప క్కింట్లోని పసివాడిని ఎత్తుకుని ముద్దాడాలన్న ఆశ వారాల తరబడి ఆశగానే మిగిలిపోతుంది.

ఒక్కొక్కసారి ఆమెకి భయం వేసేది. "ఎన్నాళ్లు చేయ గలుగుతాను నేను ఈ పనికి! ఇం కో నాలుగు రోజులు పోతే న న్నే ఎవరైనా చూడాల్సిన పరిస్థితి వస్తే అప్పు డెలా!" అన్న ఆలోచనతో.

కానీ అంతటి పరిస్థితి రాకముందే రాజేష్ ఆవిడని తీసుకువెళ్లి పోతున్నాడు. రాజేష్ దగ్గర నుండి ఉత్తరం వచ్చిన రోజునే సగం నిశ్చింత కలిగింది సునందకి. ఇప్పుడు... ఆవిడ ఫారిన్ వెళ్లే ఏర్పాట్లు అన్నీ పూ ర్తయ్యాక... ఇప్పుడు ఇంకా నిశ్చింత గా ఉంది.

సుభద్రమ్మకి కూడా సునంద మీద ద్వేషం లే దిప్పుడు. తన సేవలతో ఆవిడ ప్రేమని జయించుకుంది సునంద. ఈ స్థితిలో కూడా ఆవిడ "సునందా!" అంటూ నీరసంగా ఒక కేక పెడితే చాలు, సునంద అం తెత్తున ఎగిరి పడుతుంది. "పిన్నీ" అంటూ పరిగెడుతుంది.

ఇంటిని, బాంకులో ఉన్న డబ్బుని సునందకే వదిలేసింది ఆవిడ. అందుకు కొడుకుని ఒప్పించింది. బాంకు నుంచి వచ్చే వడ్డీతో, ఇంటి మీద వచ్చే అద్దెతో సునంద హాయిగానే ఉండచ్చు.

అవును. ఆవిడ వెళ్లిపోతే... అప్పుడు.

తనకి నచ్చినవి తను కొనుక్కోవచ్చు. తనకి కావలసినవి తను తి నచ్చు. ఇష్ట మయిన చోటికి వెళ్లచ్చు, ఇష్టమైన వాళ్లతో మాట్లాడవచ్చు.

తల్చుకుంటేనే చాలా ఆనందంగా ఉంది సునందకి.

ఇంటికి దగ్గర్లో ఆశ్రమం ఉంది. రోజూ అక్కడికి వెళ్లాలి. రెండు గంటల సేపు ఉండి పాటలు, భజనలు నేర్చుకుంటానని వాళ్లకి ముందే చెప్పేసింది.

పాట లంటే ప్రాణం సునందకి. ఇప్పటి వరకూ ఏ రోజూ గొంతు విప్పి పాడుకునేందుకు అవకాశం ఉండేది కాదు. సవతి తల్లి ముందు మాట్లాడేందుకే ధైర్యం లేదు. ఇక పాట లెక్కడ!

పొద్దున పూట బావి దగ్గర కూర్చుని అంట్లు తోముతూంటే, పక్కనే ఉన్న గుడిలో నుంచి సుప్రభాతం వినపడేది. పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా పాటలే పాటలు. అవి వింటూ ఉంటే ఆనందంతోనూ, భరించలేనంత బాధతోనూ గుండె వణికిపోయేది. కళ్లల్లోంచి దుఃఖం పొంగు కొచ్చేది.

తను మూగదైనా బాగుండేది. ఇంత బాధపడేది కాదు. కానీ మాట లొచ్చి కూడా... ఇలా ... దేనికీ స్వేచ్ఛ లేకుండా...

ఏనాడూ పాడకపోయినా, తను చాలా బాగా పాడ గలనని, తనే పాటలు నేర్చుకొని ఉంటే చాలా పేరు వచ్చి ఉండేదనీ సునందకి గట్టి నమ్మకం. ఆమె చిన్నప్పటి నుండీ పెరుగుతూ వచ్చిన ఆ కోరిక ఇన్నాళ్లకి తీరబోతుంది.

ఆలోచిస్తూనే తయా రయింది సునంద. తల్లినీ, ఆవిడ సామానీ తీసుకుని బయల్దేరింది. సిటీలో రాజేష్ ఫ్రెండ్ ఉన్నాడు. వాళ్లు రాజేష్‌తో పాటు ఫారిన్‌లో ఉండే వాళ్లే. నెల రోజుల క్రితం ఇండియా వచ్చారు, అందర్నీ చూసి వెళ్లేందుకు.

వాళ్లతో కలిసి వెళ్లాలి సుభద్రమ్మ ఇపుడు. ఆవిడని తీసుకువెళ్లి, వాళ్లకి అప్పజెప్పడంతో సునంద బాధ్యత పూ ర్తయింది. ఆదరంగా రిసీవ్ చేసుకున్నారు వాళ్లు. "రేపు ప్రొద్దున వెళ్లచ్చు. రాత్రికి ఇక్కడ ఉండండి" అన్నా సునంద వినలేదు. "లే దండి వెళ్లిపోతాను" అంటూ వచ్చేసింది.

ఎం తయినా పిన్నిని వదిలి వస్తుంటే చాలా బాధ వేసింది. పాపం ఆవిడ కూడా తన చేతులు పట్టుకుని 'జాగ్రత్తమ్మా' అంది వణికే కంఠంతో. చిన్నగా నిట్టూర్చి కన్నీళ్లు తుడుచుకుంది సునంద.

హడావిడిగా బస్ స్టాప్‌కి వచ్చి చివరి బస్ అందుకుంది. చల్లటి గాలి సర్వ వేదనలనీ తరిమి

కొడ్తోంది.

స్వేచ్ఛ - స్వేచ్ఛ - అటు ఆకాశం, ఇటు భూమి, మధ్యలో తను. అంతే. ఇం కేమీ లేవు. తన మీద ఎవరి ఆంక్షలూ లేవు. ఎవరితో సంబంధాలు లేవు. ఆనంధం అణు వణువునా గిలిగింతలు పెడుతోంది.

చిన్నప్పుడు శ్రీరామనవమి పందిట్లో ఒక సినిమా చూసింది సునంద. అందులో రాజకుమార్తె ఒక పేద అబ్బాయిని ప్రేమిస్తుంది. అతనిని తప్ప ఎవరినీ పెళ్లి చేసుకో నంటుంది. కానీ రాజకుమార్తె కదా! అందుకే ఆ అబ్బాయిని... ఆమె రాజ్యంలోని ఒక మామూలు అబ్బాయిని కూడా ఆమె పొందలేకపోతుంది. చివరికి అతను చచ్చిపోతా డు. రాజకుమార్తెకి వేరే పె ళ్లవుతుంది.

ఆ సినిమా చూసి సునంద చాలా ఏడ్చింది. "ఆ అమ్మాయి రాజకుమార్తె అవడం వల్లనే కదా! అన్ని కష్టాలు" అనుకుంది.

తరువా త్తరువాత అనిపించేది. ఆ రాజకుమార్తె అతనిని ప్రేమించినట్లే తనూ స్వేచ్ఛని ప్రేమించింది. జీవితా న్ని ప్రేమించింది. అవే తనకి దొరకలేదు. అవును... అందరికీ సునాయాసంగా, పుట్టుకతోనే దొరికే జీవితం కూడా తనకి దొరకలేదు. పుట్టింది. అంతే. బ్రతకడం మాత్రం ఎవరి కోసమో!

బస్ దిగి, రిక్షా ఎక్కింది సునంద. ఆనందంగా కళ్లు మూసుకుంటూ అనుకుంది. "కానీ ఆ. రాజకుమార్తె కోరిక సినిమా అయిపోయే వరకూ తీరలేదు. అన లెప్పటికీ తీరదు ఇంక. అతను చనిపోయాడు. కానీ తనకు... తనకు... లేదు. దేవుడు తన మీద అంత నిర్దయ చూపించలేదు... ఇప్పటికైనా తన కోరిక తీరుస్తున్నాడు."

ఇల్లు సమీపిస్తుంటే సునంద మెల్లగా పర్సులో నుండి డబ్బులు తీసుకుంది. తాళం చెవి తీసి చేత్తో పట్టుకుంది. అదే ఇల్లు... ఒ కప్పుడు తనకు నరక మనిపించిన ఆ ఇల్లే ఇప్పుడు ఆశల తీరంలా... తన కోసం సృష్టించ బడిన స్వర్గంలా తోస్తుంటే తల ఎత్తి చూసింది.

ఇంటి చుట్టూ ఉన్న కొబ్బరి చెట్లు, వీధి వాకిలి దగ్గరి గన్నేరు చెట్టు, తన చేతుల్లో పెరిగిన గులాబీ మొక్కలు అన్నీ కనిపిస్తున్నాయి. వాటి మధ్యలో తెల్లగా మెరిసిపోతున్న ఇల్లు...,

ఇంటి ముందు... ఇంటి ముందు అరుగు మీద ఎవ రది! మసక మసకగా ఏవో ఆకారాలు కనిపిస్తున్నాయి. ఎవరో ముస లాయన. ఒంట్లో సత్తువ లేనట్లూ వాలిపోతున్నాడు. పక్కనే మరో యువకుడు.

"నమస్కార మమ్మా. నా పేరు గోవింద్" అన్నా డతను సునంద గేటు తెరుచుకుని లోపల అడుగు పెట్టగానే.

"ఈయన పేరు శంకరం. చాలా రోజుల నుంచీ మా ఇంట్లో ఉంటున్నాడు. ఏనాడూ అద్దె ఇవ్వాడు. ఇల్లు ఖాళీ చేసి పొ మ్మంటే పోడు. పైసా ఆదాయం లేదు. శరీరం చూస్తే రోగాల పుట్ట. నాలుగు రోజుల నుంచి శవంలా పడి ఉన్నాడు. పూర్తిగా శవమైతే బయట పా రేద్దును. 'ఏమి టయ్యా! మా కీ తద్దినం' అంటే చివరికి ఈ అడ్రస్ చెప్పాడు. అమ్మా! మీ కీయన తెలును కదా!"

అతని ప్రశ్న సునందకి మొదట అర్థం కాలేదు. అర్థ మయిన తర్వాత తల తిప్పి ఆ మునలాయనని చూసింది. అవును. అతను శంకరమే. తన భర్త శంకరం.

ఆమె మొహంలో భావం అర్థం కాగానే అతను కదిలాడు. "మరి నే వెళ్తొస్తా నమ్మా. త్వరగా వెళ్తే చివరి,బస్ అందుతుంది." ఆమె తేరుకునే లోపూ అతను ఆ వీధి దాటాడు.

సునంద స్థాణువులా, నిలబడిపోయింది.

"ఏ మయింది! ఇప్పుడు ఏ మయింది!"

ఆమెకు అన లేమీ అర్థం కావడం లేదు.

అటు ఆకాశం., ఇటు భూమి., మధ్యలో తను... ఊపిరి అందక ఉక్కిరి బిక్కిరి అయిపోతూ తను... చలికి వణికిపోతూ తను.

"సునందా!"

విషాదం కన్నా విషాదంగా ఉన్న ఆ నిశ్శబ్దంలో నుంచీ మెల్లగా వినపడింది శంకరం పిలుపు. సునంద ఉలిక్కిపడి కదిలింది.

గుండె లోతుల్లో నుంచి వెల్లు వలా ఎగసిన దుఃఖం బయటకి వచ్చే శక్తి లేక గొంతు వెనకే నుదులు తిరిగింది. ఓదార్పు చెపుతున్నట్లూ ఒక కన్నీటి చుక్క మెల్లగా కంఠం పైకి జారింది. ●


మా హస్తకళలు ఒక వారసత్వ సంపద : మేము ఆంధ్రప్రదేశ్ హస్త కళా వారసత్వ పోషకులం !

కళాత్మక సంపదకు, రసజ్ఞత, ప్రాంతీయ శోభ, సంప్రదాయ వైభవం, అద్భుతమైన శిల్ప సంపద, ఉలితో చెక్కిన రమణీయ కళా ఖండాలు, సౌందర్య శోభితమైన పెయింటింగ్స్, ఉత్తమ శ్రేణి చేనేత వస్త్రాలు, మంత్రముగ్ధులను చేసే ఎంబ్రాయిడరీ, ఫాన్సీ ఫ్లోర్ కార్పెంగ్స్ కోసం లేపాక్షి ఎంపోరియంను దర్శించండి. ఆంధ్రప్రదేశ్‌లో హస్తకళా విన్నాణతకు ప్రతీకగా నిలిచే లేపాక్షి ఎంపోరియంలోని ఉన్నతమైన కళా వైశిష్ట్యం మిమ్మల్ని మనోహర వాతావరణంలో విహరింపజేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ
తారామండల్, మూడవ అంతస్థు, సైఫాబాద్, హైదరాబాద్



దీపావళి రిబేట్
హస్తకళలు 10%
చేనేత వస్త్రాలు 10 %
2-11-93 నుండి 12-11-93 వరకు

LePakshi
హస్తకళల విక్రయ కేంద్రాలు

★ గన్‌ఫౌండ్రీ & ఎయిర్‌పోర్ట్ కౌంటర్ - హైదరాబాద్ ★ గాంధీనగర్ - విజయవాడ ★ మెయిన్ రోడ్ - వైజాగ్ ★ ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ - నిజామాబాద్ ★ జి.టి.రోడ్ - రాజమండ్రి ★ నలందా షాపింగ్ కాంప్లెక్స్ - కర్నూలు ★ ప్రొద్దుటూరి కాంప్లెక్స్ - వరంగల్ ★ అనంతపూర్ ★ పుట్టపర్తి ★ తిరుపతి & తిరుమల హిల్స్ ★ నాగార్జునసాగర్ ★ అరండల్‌పేట - గుంటూరు ★ బాబా ఖరక్ సింగ్ మార్గ్ - న్యూఢిల్లీ ★ డాక్టర్ రాధాకృష్ణన్ సాలయ్ - మద్రాస్ ★ గరీహట్ - కలకత్తా ★ రెసిడెన్సీ రోడ్ - బెంగుళూరు ★ బస్టాండ్ రోడ్ - కరీంనగర్.

NELSON